# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 38 సంచిక 12

పేజీలు 44

ఆగస్ట్ 2019

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

శ్రీకృష్ణ కర్ణామృతము ........................................4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట........................................ 7

ముక్త పురుషులు - శ్రీపరాశర ప్రసాద్......9

భక్తుల స్పందన ............... ...................... ............11

నిజమైన చదువు ........................................14

శ్రీమాతాజీవారి ఆశ్రమేతర కార్యక్రమములు................. ............15

రామాయణంలో స్త్రీ పాత్రలు ......................16

రాధ భక్తి ........................... ..............................18

మన నిత్య ప్రార్థనలోని న్యాయాలు.......20

భక్త వెంకన్న ................. ...... ......................21

వచ్చిన దారినే పో! ............. ...........................25

ప్రత్యేక ప్రతిపత్తి ....................... ........................26

సప్తసప్తాహాల సత్సంగ సమావేశాలు - విజ్ఞప్తి 27

మరువకురా మాధవుని స్మరణము 28

నామ మహిమ ............ ............................ .....30

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు............................31

భజ గోవిందమ్ ..................... ........................32

అహంకారం .................. ...................... ...............34

కైవల్యోపనిషత్ ... ..............................................37

సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....38

విష్ణు కథలు ...... ............................ ....................40

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 36 వ శ్లో॥**

**కేకి కేకాదృతానేక పఙ్కేరుహా,**
**లీన హంసావళీ హృద్యతా హృద్యతా,**
**కంస వంశాటవీ దాహ దావానలః**
**సఙ్గగౌ వేణునా దేవకీ నన్దనః**

**తాత్పర్యము -**



నెమలి కూతలచే నాదరింప బడినదియై, కమలములనణిగి యున్న హంసలను సైతముల్లాస పరచుచున్న మేఘధ్వని యను తలపుచే పిల్లనగ్రోవిని పట్టుకొని, కంసుడను వెదురాటడవిని కాల్చుటకు కార్చిచ్చను శ్రీకృష్ణుడు పిల్లన గ్రోవిని ఊదుచున్నాడు.

1. భగవంతుని ఎలా పిలవాలి?
2. నిజంగా చదువుకోవడం అంటే ఏమిటి?
3. భజగోవింద శ్లోకాలు ఎన్ని?
4. తనను మోసం చేసిన పండితుని కూడా తరింపజేసిన భక్తుడెవరు?
5. యజ్ఞనారాయణకు ఆపరేషన్ లేకుండా అపెండిసైటిస్ ఎలా తగ్గింది?
6. దేహానికి వున్నది, మనస్సుకు లేనిది ఏమిటి?
7. సంసారం చేస్తూ బ్రహ్మచారిగా, భోజనంచేస్తూ ఉపవాసిగా వుండటం ఎలా?
8. ధ్యానం కుదరాలంటే ఏం చేయాలి?
9. స్వామి వివేకానంద అమెరికా వెళ్ళిన అసలు కారణం ఏమిటి?
10. భగవన్నామాన్ని ఎప్పుడైనా, ఎక్కడైనా స్మరించవచ్చా?
11. మనకు కీడు చేయని అహంకారం కూడా వుంటుందా?
12. మోక్షానికి మార్గం ఏమిటి?

***------ సమాధానాలు లోపలి పేజీలలో***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

18-2-1980

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ వాకింగ్ అయిన తర్వాత ప్రార్థన చేయించారు. ప్రార్థన చేసేటపుడు "ఓం అసతోమా సద్గమయ, ఓం తమసోమా జ్యోతిర్గమయ, ఓం మృత్యోర్మా అమృతంగమయ' అనే ప్రార్థనలో చివరిపంక్తిని ఉచ్ఛరించేటప్పుడు స్వరాన్ని పెంచాలి. అలా స్వరాన్ని పెంచటానికి ఒక విశేషం ఉంది" అని శ్రీ బాబూజీ అన్నారు.



"భగవానుడిని ప్రార్థించేటపుడు 'ఓ పరమాత్మా! నన్ను మృత్యువు నుంచి కాపాడు. నాకు అమృతత్వాన్ని ప్రసాదించు' అని స్వరాన్ని పెంచి పిలవాలి అప్పుడే ఆ పిలుపు ఆయనకు అందుతుంది. అదే ప్రార్థన నిదానంగా చేసినట్లయితే భగవానుడికి వినబడుతుందా? ఎవరి ఇంటికైనాపోయి ఇంటి వాకిలివద్ద నిలుచుండి బిగ్గరగా పిలుస్తే పలుకుతారా? పలకరా? తప్పక పలుకుతారు" అన్నారు శ్రీ బాబు.

"భగవానుడిని స్వరం హెచ్చించి పిలవటం అంటే మనస్ఫూర్తిగా పిలవటం అన్నమాట. మనస్ఫూర్తిగా, అంటే మనస్సు పరమాత్మపై లగ్నముచేసి పిలుస్తే ఎందుకు పలకడు? అయితే భగవానుడికి మనకి మధ్య చాలా ద్వారాలు అడ్డు ఉన్నాయి. కాబట్టి చాల గట్టిగా పిలవాలి.

మొదటి ద్వారం రాగద్వేషాలు 2,3,4 ద్వారాలు త్రిగుణములైన సత్త్వ, రజో, తమో గుణాలు. పరమాత్మకు మన పిలుపు అందాలంటే రాగద్వేషాలను, సత్త్వ, రజో, తమో గుణాలను వదలి మనస్ఫూర్తిగా పిలవాలి. అటువంటి ప్రార్థన తప్పక ఫలిస్తుంది.

ఈ పిలుపు అర్థం ఏమిటి? 'పరమాత్మా! నేను సంసారమనే

బురదలో శిరస్సు వరకూ మునిగియున్నాను. నాకు ఊపిరి కూడా అందటంలేదు. నన్ను కరుణించి నాకు ఈ దేహబాధని పోగొట్టి జనన మరణములనుంచి రక్షించవయ్యా! పరంధామా! దీనబాంధవా! అని. అయితే మనస్సు మాత్రం పరమాత్మకి అర్పించాలి. అప్పుడే ఆ పిలుపు ఫలిస్తుంది.

వివేక చూడామణిలో చెప్పబడినట్లు మానవజన్మ ఉత్తమమైనది. అట్టి మానవజన్మ ఎత్తినవాడు పురుషుడైతే ఇంకా శ్రేష్ఠము. పురుషుడు పరతత్త్వ జ్ఞానము కలిగి సద్గురువు యొక్క కరుణా కటాక్షముతో పురుషార్థమైన పరతత్త్వాన్ని సాధిస్తే ఇంకేమి కావాలి!

జ్ఞానికి స్త్రీ, పురుష భేదం లేదు, పురుషార్థాన్ని సాధించినవాడికి స్త్రీ పురుష భేదం తెలియదు. అట్టి అభేద స్థితియే బ్రహ్మము. బ్రహ్మం అంటే ఆనందం. భేదస్థితియే అజ్ఞానం. మొదటి అక్షరంతో కూడినది అకారమైనది బ్రహ్మం. అమ్మా అన్న పిలుపులో ఉన్న వాత్సల్యం, అమృతత్వం దేనిలో ఉంది? అమ్మా! అని పిలిస్తే ఎవరైనా కరుణిస్తారా? ఏమండీ అని పిలిస్తే కరుణిస్తారా? కాబట్టి శబ్దంలో ఎంతో మహత్తు ఉంది. అట్టి శబ్దాన్ని, వాక్కుని మొదట శుద్ధి చేసినట్లయితే మిగతా విషయాలన్నీ అవే శుద్ధి చెందుతాయి" అన్నారు శ్రీ బాబు.

"అట్టి వాక్శుద్ధి కలిగిన వాడికి ఉన్న శాంతి ఎవరికి ఉంటుంది? దీని ద్వారా అంతఃకరణశుద్ధి చెందిన మనస్సు ఎలా ఉంటుంది? ఆనందమయంగా ఉంటుంది. అట్టి ఆనందాన్ని ఏ కవులు వర్ణించగలరు? అట్టి ఆనందాన్ని అనుభవించేవాడు అఖండ తేజస్సును దర్శించగల్గుతాడు. ఆ తేజస్సు సహస్ర సూర్యులకన్న ఎక్కువ కాంతినిస్తుంది. కాని అది చల్లని కాంతి. ఆ తేజస్సుని ఏ కవులు వర్ణించగలరు? ఆ వెలుగులో లీనమైనపుడు ఇక జనన మరణాలతో పని ఏముంది?' అని బోధని ముగించారు శ్రీబాబు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## జ్ఞాన నవనీతం

ఆరాధన అనే శబ్దంలో ఆ - సమంతాత్ (సంపూర్ణంగా) రథనం - అంటే మథించడం. దేనిని మథించాలి? నీ మనస్సులో నిరంతరం, సంపూర్ణంగా, భగవన్నామాన్ని గురులక్ష్యార్థాన్ని మథించాలి. ఇదే మనకి అమృతబిందూపనిషత్ కూడా చెబుతోంది. '**సతతం మనసి మథయితవ్యమ్** ' అని.

పాలలో వెన్న దాగి వున్నది. పాలలో అంతటా వున్నది. కాని అది మనకి కనబడటం లేదు. ఆ పాలని పెరుగు చుక్కవేసి, తోడు బెట్టాలి. పెరుగు తోడుకున్నాక మజ్జిగ చేయాలి. తరువాత దానిని చిలకాలి. అప్పుడు వెన్నవస్తుంది. ఇక వెన్న అయినాక అది మళ్లీ తిరిగి మజ్జిగ లోనూ కలవదు, నీటిలోనూ కలవదు.



అదేవిధంగా, పరమాత్మ వస్తువు సర్వే సర్వత్రా నిండి వున్నది. మనలోనూ నిండి వున్నది. ఆ దివ్య చైతన్యం మనలోనే వుండి, మనని ప్రకాశింప జేస్తూ, మనని ఆడిస్తోంది. అదే అసలు 'నేను'. 'ఆ శివ స్వరూపమే నేను' అని గురుమూర్తి మనకి 'హంసశివస్సోహమ్' అనే సూచన మంత్రం ద్వారా అందిస్తున్నారు. గురుదేవుడు ప్రసాదించిన దివ్యమంత్రాన్ని నిరంతరం మనస్సులో మథించాలి. విచారణ చేయాలి. ధ్యానించాలి. అలా చేయగా చేయగా, మనస్సులోని మాలిన్యాలు హరించి, దాని చంచలత్వముడిగి, నిశ్చలత్వం వస్తుంది. ఆ నిశ్చలత్వమే జీవన్ముక్తి. గురులక్ష్యార్థాన్ని మథించగా, మథించగా మనలో జ్ఞానమనే నవనీతం ఉద్భవిస్తుంది. జ్ఞానము ఉద్భవించిన తరువాత తిరిగి మనమీ ప్రపంచమనే నీటిలోగాని, మజ్జిగలో గాని కలవము. దానికి విలక్షణంగా వుంటాము. ఇటువంటి నిశ్చల స్థితి రావడానికి ముఖ్యకారణం 'సత్సంగం' అందుకనే శ్రీఆదిశంకర భగవత్పాదాచార్యులవారు 'సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చలతత్వం, నిశ్చలతత్వే జీవన్ముక్తిః' అని శెలవిచ్చి వున్నారు.

నిప్పు ముట్టుకుంటే కాలుతుందని తెలియని చిన్నపిల్లలు, దానిని ముట్టుకుంటారు. తెలిసినవాళ్ళు ముట్టుకోరుకదా! ఈ ప్రపంచ విషయాదులు, సంసారం అన్నీ అనిత్యం, అసత్యం అని తెలుసుకున్నవాడు మళ్ళీ వాటిలో ఇరుక్కోడు. అది తెలియనంత వరకూ, అవే సుఖాన్నిస్తున్నాయని భావించి, వాటిలోనే మునిగి తేలుతూ వుంటాడు. మానవుడు ఈ సంసార దావానలం నుండి మనని రక్షించేది కేవలం గురు లక్ష్యార్థం ఒక్కటే. కలికాలంలో హరినామం వినా వేరేగతి లేదు అని ఉపనిషత్తులు చెబుతున్నాయి.

**నాస్తి నాస్తి కలౌ నాస్తి, హరినామ వినా గతిః ।**
**తస్మాత్ యత్నేన జప్తవ్యమ్ హరేర్నామైవ కేవలమ్ ॥**

కనుక ప్రయత్నంతో హరినామం జపించి తీరాలి. సాధన చేయాలి. సాధనవల్ల సాధ్యమయి తీరుతుంది. పట్టుదల కావాలి. తీవ్రమైన వైరాగ్యమే పట్టుదల.

అటువంటి అఖండ భక్తి, జ్ఞాన వైరాగ్యములని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా మనలను రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా, ఆగస్ట్, సెప్టెంబర్ 2019 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***ఆగస్ట్ 2019 -*** AS 2153, 5457, 5937, 5957, 5958, 6900, 6906, 6907, 7517, 7673, 7746, 7788, 7790, 7798.

***సెప్టెంబర్ 2019 -*** AS 5983, 6054, 6057, 6058, 6923, 7365, 7595, 7596, 7800 నుండి 7807 మరియు 7809 నుండి 7814, 7816, 7817, 7820, 7821, 7822, 7824 నుండి 7832, 7834, 7835, 7837 నుండి 7857, 7860, 7862 నుండి 7871, 7873, 7874, 7877 నుండి 7895.

# ముక్త పురుషులు – శ్రీ పరాశర ప్రసాద్‌గారు

- రమణ ప్రసాద్

శ్రీబాబూజీ మహరాజ్‌వారు మానవాళిని తరింపజేయటానికి వచ్చి, వారి ప్రణాళిక ప్రకారం భక్తులను తమ వద్దకు రప్పించుకోవటానికి ఎంతో శ్రమ పడ్డారు . శ్రీ రామకృష్ణ పరమహంస, మిద్దెపైకి ఎక్కి, "నా భక్తులారా రండి!" అని ఎలుగెత్తి అరిచేవారట. ఆ విధంగా శ్రీ బాబూజీ తమ సన్నిధికి రప్పించుకొన్న భక్త శిరోమణులలో శ్రీ జగన్మోహన బాల కృష్ణ లాల్ గారు ఒకరు. పరమ భక్తుల ఇంట్లో వారు జన్మించారు. అందువల్ల వారి అటు ఏడు తరాలవారు, ఇటు ఏడు తరాలవారు తరిస్తారన్నది తథ్యం.



వారి తల్లి దండ్రులు తమ పుత్రునికి 'జగన్మోహన బాల కృష్ణలాల్' అనే నామధేయం చేశారు. శ్రీబాబూజీ ఆయనకు "పరాశర ప్రసాద్" అనే సార్థక నామధేయం స్థిరపరిచారు. శ్రీబాబు ఆయనను ప్రేమగా "లాల్!" అని పిలిచేవారు.

శ్రీబాబూజీ పాదాలను ఆశ్రయించిన తరువాత ప్రతి రోజు ఉదయమే వచ్చి శ్రీ గురుదేవులను దర్శించుకోవటం వారి దినచర్యగా మారింది. శ్రీబాబూజీ వెంటనంటి ఉంటూ వారు చెప్పిన దివ్యబోధలను ఆకర్ణాంతం విని, ఇంటికి వెళ్ళి డైరీలో వ్రాసుకొనేవారు. వారిది కళాశాలలో ఉపాధ్యాయ వృత్తి. శ్రీబాబూజీ వారి దర్శనం ఉదయం వ్యాహ్యాళిలోగాని, రాత్రిగాని అయ్యేది. శ్రీలాల్ గారు స్వాతి చినుకు కోసం వేచిన ముత్యపు చిప్ప వలె వేచి ఉండి శ్రీబాబూజీ చెప్పిన మాటలను డైరీలో వ్రాసు కొనేవారు.

వారి మాటలలో, "శ్రీ బాబూజీతో గడిపిన క్షణాలు మరువరానివి. అందుచేతనే అవి దివ్య స్మృతులు. అవి మనస్సులో చెరగని ముద్ర వేస్తాయి. శ్రీబాబూజీ దివ్య బోధ కోసం, ముత్యపు చిప్ప స్వాతి చినుకుకోసం ఎదురు చూసినట్లు వేచి ఉండేవాళ్ళం. ఆయన ఆదేశానుసారం, నిత్యం చేసిన బోధలను డైరీగా వ్రాసుకొని మననం చేసుకొనే వాళ్ళం. ఈ **దివ్య**

స్మృతులు భక్తి శ్రద్ధలతో పఠించినా, శ్రవణం చేసినా, శ్రీ సద్గురుమూర్తి అనుగ్రహాన్ని పొందటానికి తోడ్పడతాయి."

ఈ విధంగా వారు ఇప్పటి వరకు 11భాగాలుగా "***శ్రీ బాబూజీ దివ్య స్మృతులు***" అనే పేరుతో భక్త కోటికి అందించారు. ఈ బోధలు ప్రతిరోజూ సాయంకాలం ప్రార్థనానంతరం గురు సోదరులైన శ్రీ నారాయణ ప్రసాద్‌గారు చదవటం, దానిని శ్రవణం చేసి భక్తులు లబ్ధిని పొందటం, ఆశ్రమంలో నిత్య కార్యక్రమంగా జరుగుతోంది.

ఎన్నో సంవత్సరాలు శ్రీలాల్‌గారు ఆశ్రమ గురుకులానికి "కరెస్పాండెంట్"గా సేవ చేసి గురుకులానికి ఎంతో వన్నె తెచ్చారు. వారి సమయంలో చదివిన విద్యార్థులు వివిధ రంగాలలో ఆరితేరారు. అంతేకాక వారు "సమర్థ సద్గురు" తెలుగు మాస పత్రికకు ఎడిటర్‌గా తమ అమూల్యమైన సేవలను అందించారు.. "సమర్థ సద్గురు" ఇంగ్లీషు త్రైమాసిక పత్రికకు ఎన్నో ఆధ్యాత్మిక వ్యాసాలను వ్రాశారు.

ఇటీవల శ్రీ లాల్‌గారు స్వల్ప అనారోగ్యానికి గురియై, జూన్ 28న ఉదయం 4 గంటలకు కుటుంబ సభ్యులందరినీ తన దరికి చేర్చుకొని, శ్రీ బాబూజీ బోధల క్యాసెట్‌ను వింటూ, దేహబాధలను ఏ మాత్రం లెక్క చేయకుండా, 'ఫేస్‌టైమ్'లో శ్రీమాతాజీ వారి చూపులో చూపు నిలిపి తమ పార్థివ శరీరాన్ని విడిచి శ్రీగురుదేవులలో ఐక్యం అయ్యారు. వారు జీవన్ముక్త స్థితిని పొందారు.

శ్రీ లాల్‌గారు గురు తత్త్వాన్ని సమగ్రంగా జీర్ణించుకొని , వివిధ ప్రసంగాలలో గురు తత్త్వాన్ని శ్రీగురుదేవుల మాటలలో చెప్పి భక్తుల హృదయాలకు హత్తుకొనేటట్లు ప్రసంగించేవారు.

గురు సోదరులు శ్రీ పరాశర ప్రసాద్ గారు భక్తుల హృదయాలలో చిరకాలం నిలిచి ఉంటారు. వారు రచించిన దివ్య స్మృతులు, వారు చేసిన బోధలు భక్తులందరికీ మార్గ దర్శకములు.. వారి గురించి భక్తులు వ్యక్త పరచిన భావాలను "భక్తుల స్పందన" రూపంలో పొందుపరుస్తున్నాము. అవి వారి ఔన్నత్యాన్ని మరింతగా తేటతెల్లం చేస్తాయి.

# భక్తుల స్పందన

**జపమాల ప్రసాద -**

"గురుబోధని అనువుల చేనులో పడ్డ ఆవు గబగబా మేసినట్లుగా మేసేసి, తిరిగి దానిని చక్కగా నెమరు వేసుకున్ననాడు, అది చక్కగా జీర్ణమయి, మీ రక్తాన్ని, మీ మేధస్సుని శుద్ధి చేస్తుంది" - ఈ గురు వాక్యాన్ని అక్షరాలా పాటించిన మహనీయుడు శ్రీ పరాశర ప్రసాద్‌గారు (శ్రీ లాల్‌గారు). శ్రీగురు దేవుల బోధలను ఆకర్ణాంతము విని, తిరిగి మేమందరం కూర్చుని వాటిని నెమరు వేసుకునేవాళ్ళం. ఆ తరువాత ఇంటికి వెళ్ళి పుస్తకంలో రాసుకునే వాళ్ళం మా గురుసోదరులు, నేను.

ఈనాడు మనకి 'శ్రీబాబూజీ దివ్యస్మృతులు' అనే పుస్తకాల రూపంలో శ్రీగురుబోధామృతాన్ని మనకందించిన మహామనీషి శ్రీపరాశర ప్రసాద్.

ఇన్ని పుస్తకాలు వ్రాశారు. ఇంటి నిండా పుస్తకాలు, కాగితాలు, పెన్నులే! కానీ వీటిలో ఏ ఒక్కటయినా ఆయన తీసుకువెళ్ళారా?

అక్షరాలు దిద్దేముందు పలకా, బలపం కావాలి. కానీ నీకు అవి వచ్చేశాక, ఆ అక్షరాల స్వరూపం నీవు అయిపోయాక, మళ్ళీ 'అ' అనే అక్షరం వ్రాయడానికి నీవు పుస్తకం చూడాలా?

అదే విధంగా శ్రీలాల్ గారు గురుబోధని దిద్ది, దిద్ది, చూర్ణం చేసి, త్రాగేసినవారు. అది వారి నరనరాలలోనూ నిండిపోయినది. ఆ బోధ స్వరూపం తానయిపోయినవారు కాబట్టే సంపూర్ణంగా నిజజాగ్రతలోనే వుండి, శరీరం పడుతున్న బాధని సాక్షిగా చూస్తూ, 'మాం శరణం శరణం గచ్ఛామి. సత్యం శరణం గచ్ఛామి. ధర్మం శరణం గచ్ఛామి. సంఘం శరణం గచ్ఛామి' అంటూ శ్రీమాతాజీవారి చూపులో చూపు నిలిపి, గురుదేవునిలో లీనమయిపోయిన ధన్యజీవి శ్రీ పరాశరప్రసాద్ గారు. వారికి శతకోటి ప్రణామ నివాళులర్పిస్తూ......

**పాలూరి కాళీప్రసాద్ -**

బ్రహ్మమే స్వయంగా శ్రీ గురుదేవుల రూపంలో అవతరించి నెలకొల్పిన బ్రహ్మవిద్యా సాంప్రదాయంలో తాము నడవటమేకాక మనందరినీ కూడా చేయిపట్టి ఆ మార్గంలో నడిపించిన వంశ

ఋషులలో ఒక ఋషి ఆ బ్రహ్మంలో ఐక్యం అయిపోయారు.

శ్రీగురుదేవుల ముఖస్తుగా వచ్చే ప్రతి వాక్కు బోధయే. వారి స్వరూపమే బోధ. అట్టి బోధను వారి అవతార కాలంలో ప్రత్యక్షంగా అందుకొనే భాగ్యం కొద్దిమందికే కలిగినా, తమ భాగ్యాన్ని తామే దాచుకోవాలనే లోభాన్ని దరి రానీయక రానున్న తర తరాలవారికీ, విశేషంగా పంచిపెట్టాలనే మహదాశయంతో శ్రీగురుదేవుల వాక్కును గ్రంథస్థం చేసి ఎన్నో సంపుటాలుగా మనందరికీ అందించిన దివ్యఋషి..

అంతేకాక, శ్రీగురుదేవుల ఆజ్ఞానుసారం మన ఆశ్రమ గురుకులంలో ఎన్నో సంవత్సరాలు ఉపాధ్యాయులుగా, కరెస్పాండెంట్‌గా తమ అమూల్య సేవలను అందించి భావి తరాలను ఆదర్శవంతులుగా, ఆధ్యాత్మిక పథ గాములుగా తీర్చదిద్దారు.

కేవలం చిన్నారులకే కాక ఆబాలగోపాలానికంతటికీ ఈ బ్రహ్మవిద్య అందాలనే మహదాశయంతో శ్రీ గురుదేవులు స్థాపించిన **'సమర్థ సద్గురు'** ఆధ్యాత్మిక మాస పత్రికలో ఎన్నో అమూల్యమైన వ్యాసాలను అందించటమే కాక ఆ పత్రిక సంపాదకులుగా కూడా తమ సేవలను అందించిన మహనీయులు శ్రీ పరాశర ప్రసాద్ వారు.

ఒకప్పుడు ఎందరో పెద్దలు లోతైన ఆధ్యాత్మిక తత్త్వ విషయాలను గూర్చి ప్రసంగించిన తరువాత శ్రీ పరాశర ప్రసాద్‌గారు మైక్ ముందుకు రాగానే 'ఇప్పుడు మనం శ్రీబాబూజీవారి మధురవాక్కులను వినవచ్చు కదా!' అని ఉత్సాహపడటం మనందరికీ అనుభవంలో ఉన్న విషయమే.

శరీరం దాల్చి వచ్చాక అనివార్యమైన దేహత్యాగాన్ని ముందుగానే గుర్తించి, అందుకు తన చుట్టూ ఉన్నవారిని సిద్ధంచేసి, ఆనందంగా శ్రీగురుదేవుల స్మరణలో, వారి బోధామృతాన్ని గ్రోలుతూ, వారినే దర్శిస్తూ, వారిలోనే లీనమై మనందరికీ ఆదర్శవంతులైన శ్రీ పరాశర ప్రసాద్ వారు నడిచి చూపిన బాటను అనుసరించి మన జన్మలను చరితార్థం చేసుకోవటమే వారికి మనం అర్పించగలిగిన ఘన నివాళి.

***నేలభొట్ల. ప్రసాద్ -***

శ్రీ బాబూజీ పరమ భక్తుడు, వేదాంత కోవిదుడు, అయిన పరాశర ప్రసాద్ గారి అస్తమయం ఆధ్యాత్మిక కుటుంబానికి తీరని లోటు. వారి జీవిత విశేషాలు, వారి బోధలు యువ తరానికి మార్గదర్శకాలు.

వారు సూచించిన మార్గాన్ని అనుసరించి నడుచుకోవటమే మన తక్షణ కర్తవ్యం.

***దిగ్విజయ్ -***

ఒక మహో వ్యక్తి మనందరి మధ్యనుంచి భౌతికంగా నిష్క్రమించారు. వారు మనందరికీ అందించిన "శ్రీ బాబూజీ దివ్య స్మృతులు" మన స్మృతిలో ఉన్నంత వరకు వారు మనతోనే ఉంటారు.

***రఘువీర్ -***

శ్రీబాబూజీవారి ప్రియ భక్తులు గురు సాయుజ్యం పొందారు. ఇది మనందరికీ తీరని లోటు. కాని మనకి వారి దర్శన, స్పర్శన సంభాషణలు చేసే భాగ్యం లభించటం మన అదృష్టం.

***కె.వి. ఆర్ రమణ (కరెస్పాండెంట్, గురుకులం) -***

శ్రీ పరాశర ప్రసాద్ గారి నిధనం వల్ల భక్తులందరికీ తీరని నష్టం వాటిల్లింది. వారు శ్రీ బాబూజీ వారి బోధలు మనకి గ్రంథరూపంలో అందించారు. గురుతత్త్వాన్ని బోధించారు. అంతే కాక వారు ఆశ్రమ గురుకులానికి తమ విలువైన సేవలను అందించారు. వారు జీవన్ముక్తిని పొందారు. వారు చూపిన దారిలో పయనించి గమ్యాన్ని చేరుకుందాం.

***కృష్ణ ప్రసాద్ -***

ఆ గురు సోదరుని ఋణం తీర్చుకోవటం భక్తులకు అసాధ్యం.

***డా. ఆశోక వర్మ -***

చాలా చాలా సుసాధ్యం. వారు నడిచి చూపించిన మార్గంలో నడవటమే! అదే మనకి మార్గదర్శకము.

**రాగద్వేషాదులతో నిండిన ఈ ప్రపంచము స్వప్నతుల్యము. అజ్ఞానిగా ఉన్నంతకాలమూ అది స్వప్నంగా తోస్తుంది. జ్ఞానోదయం కాగానే ప్రపంచము అసత్యమవుతుంది.**

- శ్రీ ఆదిశంకరులు.

# నిజమైన చదువు

(రామతీర్థ కథ)

ఒక గురువు దగ్గర అనేకమంది విద్యార్థులు వుండేవారు. వారిలో ఒక రాజ కుమారుడు కూడా వుండేవాడు. ఒకరోజు గురువుగారు పిల్లలను 'నిన్నటి పాఠం వచ్చిందా?' అని అడిగారు. అందరూ 'వచ్చింది' అన్నారు. రాజకుమారుడు ఏమీ మాట్లాడకపోవటం చూసి గురువు 'మరి నీకో?' అన్నారు.

'నాకు మొదటివాక్యం బాగా వచ్చింది. రెండవ వాక్యం కూడా వచ్చింది ...... ' అని ఆగిపోయాడు.

తన శిష్యుడి సోమరితనానికి మండిపడిన గురువు 'ఇదేనా నీ చదువు!' అంటూ బెత్తంతో ఎడాపెడా కొట్టారు. అంతలోనే గురువుగారికి తాను కొడుతున్నది మామూలు పిల్లవాడిని కాదని, ఈ రాజ కుమారుడు తలచుకుంటే తనను కొరత వేయించగలడని గుర్తు వచ్చేసరికి గురువుగారికి దడ పుట్టుకువచ్చింది. ఆ తరువాత ఆయనకు చాలా ఆశ్చర్యం కూడా కలిగింది. ఎందుకంటే ఎన్ని దెబ్బలు తిన్నప్పటికీ రాజ కుమారుడిలో ఒక విచారంగాని, బాధగానీ లేదు. అతడి ముఖం ఎంతో ప్రశాంతంగా ఉంది.

ఆ గురువుకు ఏం చేయాలో తోచక 'ఏమిటి నీకు వచ్చిన ఆ రెండు వాక్యాలు?' అని రాజకుమారుడిని అడిగారు.

'1. క్రోధాన్ని నిగ్రహించాలి. 2. ఎన్నడూ అసత్యం ఆడరాదు' అని సమాధానం చెప్పాడా రాజకుమారుడు.

ఈ మాటలు వినగానే గురువుగారికి కనువిప్పు కలిగింది. తాను గురువు అయినప్పటికీ, నిజమైన చదువేదో తెలుసుకోలేదు. ఆ కుర్రవాడు తెలుసుకున్నాడు. నిజమైన చదువంటే పాఠాలు కంఠస్థం చెయ్యటంకాదు. వాటిని ఆచరణలో పెట్టడం!

# శ్రీమాతాజీ ఆశ్రమేతర కార్యక్రమాలు

**ఆగస్ట్ 2019లో .........**

1-8-19 - ఢిల్లీ చేరుతారు.

2-8-19 - శ్రీ కాళీవనాశ్రమము, నంబూరు చేరుతారు.

5-8-19 - భీమవరం, సోమారామంలో హరేరామనామ సప్తాహం ప్రారంభిస్తారు. సప్తసప్తాహాలలో ఇది నాల్గవ సప్తాహము.

12-8-19 - సప్తాహమునకు మంగళహారతి.

15-8-19 - కట్టమూరులో త్రయాహ్నిక సత్సంగ కార్యక్రమములు.

17-8-19 - సత్సంగ కార్యక్రమాలు పూర్తి అగును.

**సెప్టెంబర్ 2019లో .........**

17-9-19 - 24-9-19 వరకు పాలకొల్లు క్షీరారామములో సప్తాహము ప్రారంభము. సప్తసప్తాహములలో ఇది అయిదవ సప్తాహము.

24-9-19 - సప్తాహమునకు మంగళహారతి.

11-9-19 నుండి 15-9-19 హైదరాబాద్ శాఖలో సత్సంగ సమావేశాలు.

---

**శ్రద్ధాంజలి**

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు, సమర్థ సద్గురు తెలుగు మాసపత్రిక సంపాదకులు దుగ్గిరాల జగన్మోహన బాలకృష్ణ లాల్ (పరాశర ప్రసాద్)గారు 28-6-2019 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 82 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# రామాయణంలో స్త్రీ పాత్రలు

(గత సంచిక తరువాయి) **కౌసల్య** - సుషుమ్నా ప్రసాద

అప్పుడు శ్రీరామచంద్రుడు ఎంతో సంయమనంతో తన సహజ లక్షణమైన మధుర దరహాసంతో 'ఔనమ్మా! నేను పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేయాలి, భరతుడు రాజ్యమేలాలి అన్నది నా పినతల్లియైన కైకేయి కోరిక. నా పితృదేవతలకు సత్యవాక్పరిపాలకులన్న అసాధారణ బిరుదు వున్నది. సత్యవాక్పరిపాలన అనే పైతృకమైన ఆస్తిని శాశ్వతంగా వర్ధిల్లేటట్లు చేయటం నా కర్తవ్యం తల్లీ! పూర్వం మహారాజు పినతల్లిగారి కిచ్చిన రెండు వరాలను ఇప్పుడు ఇలా నెరవేర్చమని కోరినది. అన్నీ తెలిసిన ధర్మజ్ఞురాలివి నీవు. పధ్నాలుగు సంవత్సరాలు సునాయాసంగా గడిచిపోతాయి. నన్నాశీర్వదించి పంపమ్మా!' అని ఎంతో వినయంతో, తల్లిని ప్రాధేయపడ్డాడు శ్రీరామచంద్రుడు. ప్రగాఢమైనమమతతో, ఆమె మనస్సు విలవిలలాడింది. ఆ పరిస్థితిలో ఏ తల్లి ఓర్చుకోగలదు?

అప్పుడు కౌసల్య 'నాయనా! నీవు అసలు పుట్టకపోయినా నాకీ దుఃఖం వుండేదికాదు నాయనా! ఏక ఏవహి వంధ్యాయాః శోకోభవతి మానసః అప్రజాస్మీతి సంతాపఃనవ్యాన్య పుత్రః విద్యతే.

సంతతి లేకపోయిందే అనే దుఃఖం వుండేదంతే. అంతకుమించి ఎటువంటి సంతాపం వుండేదికాదు. మీ తండ్రికి పెద్ద భార్యను. పట్టపు రాణినైనా, ఏనాడు సుఖమెరుగను. నా నోముల పంట, వరాల మూటను, ముద్దుల తనయుని పొందిన తరువాతనే ఆనందాన్ని చవిచూశాను. నా కన్నతండ్రి మహారాజవుతాడని ఎదురు చూశాను. ఆ ఆశ అడియాస అయింది. ***అపశ్యంతీ తవ ముఖం పరిపూర్ణ శశిముఖం. కృపణా వర్తయిష్యామి కథం. కృపణా కథం జీవకామే.***

రాజ్యం వద్దు, భోజ్యం వద్దు. నన్ను కనిపెట్టుకొని, నా కంటపడుతూవుంటే అదే చాలు. పూర్ణచంద్రుని వంటి నీ ముద్దుమోము చూస్తూ శేష జీవితం గడుపుదామనుకున్నాను. నిన్ను చూడకుండా వుండే దౌర్భాగ్య జీవితాన్ని యెలా గడుపుతాను రామచంద్రా! ' అని శోకించింది కౌసల్య.

పోనీ రాజ్యము భరతునకే చెందనీ. నీవు కానలకు వెళ్ళకుండా నా కంటపడుతుంటే అదే చాలు నాన్నా! అన్న తల్లిమాటలను గ్రహించాడు అది అసాధ్యమని తల్లికి తెలియజేశాడు రాముడు.

'అమ్మా! నీవు పామర కాంతలా మాట్లాడవద్దు. నీవు, నేను, సీత, లక్ష్మణుడు పినతల్లి శాసనానికనుగుణంగా ప్రవర్తించాలి. అలా ప్రవర్తించడమే సనాతన ధర్మం. మీరు, పినతల్లి సుమిత్ర పతి శాసనమునకు కట్టుబడి వుండాలి. నేను, తమ్ముడు లక్ష్మణుడు పితృ శాసనమును పాటించాలి. సీత మామగారి మాట జవదాట కూడదు.

మానవ జన్మ ధర్మములు మీకు తెలియనివికావు. పైగా మీరు సామాన్య స్త్రీ కాదుకదా. కోసల రాజ పుత్రికవై, దశరథ మహారాజు పట్టమహిషివై, ననుకన్న తల్లివై, పతివాక్యమునధిగమించుట తగదు కదమ్మా!' అని రాముడు ప్రశ్నించాడు. ధర్మము పేరుతో తనని దిగ్బంధనము చేసిన ప్రియపుత్రునితో కౌసల్య

*యద్దైవతే పుత్రః పితాతథాహం । గురుస్స్వధర్మేణ సుహృత్త యాచన*

*న తానుజా గామిన మాం విహాయసు । దుఃఖితా మర్హసి పుత్రః గంతుమ్ ॥*

నాయనా! నీవు చెప్పినది సనాతన ధర్మమే. అలాగే నేనంటున్న మాట కూడా ధర్మబద్ధమే. పుత్రునకు తండ్రి ఎంత పూజ్యుడో, తల్లి కూడా అంతే పూజ్యురాలు కదా! సనాతన ధర్మములో 'మాతృదేవో భవ, పితృదేవో భవ' అని తండ్రి కన్న కూడా తల్లికే ప్రథమ స్థానం ఇచ్చారు కదా. కనుక నా మాట విను. లేగ దూడకు దూరమైన గోమాత విలవిల లాడినట్లు నీ ఎడబాటు నేను సహించలేక పోతున్నాను కన్నా. నీకు దూరంగా బ్రతకలేను. నిన్ను కానలకు వెళ్లకుండా శాసించను. నన్ను కూడా నీతో వనాలకు తీసుకువెళ్ళు నాయనా!' అని ప్రాధేయపడింది. కాని సకల సుగుణాభిరాముడు, సకల ధర్మాలకాలంబనమైన శ్రీరామచంద్రుడు అందుకు అంగీకరిస్తాడా?

'ఏమిటమ్మా! అంత బేలగా మాట్లాడుతున్నావు? సతీధర్మం తెలియని దానివా? భర్తను విడిచిపెట్టడమన్నది స్త్రీకి నికృష్టమైన పథం. ధర్మానికి నిలయమైన మీరు ధర్మవిరుద్ధమైన విషయమును మనసా, వాచా కూడా ఆలోచించకూడదమ్మా! నన్ను ఆశీర్వదించి పంపించండమ్మా!' అన్నాడు శ్రీరాముడు.

-సశేషం

# రాధ భక్తి

- మురళీ

(23-12-1976న రాత్రి 7-30ని॥లకు శ్రీబాబు అందించిన దివ్యబోధ)

"రాధ భక్తి అనన్యమైనది. మనస్సు ఒక చోట, తనువు ఒకచోట ఉండే భక్తి కాదు. రాధది ఏకాగ్రమైన భక్తి. అటువంటి రాధకు కూడ ఒకసారి అహంకారం కలిగింది. వాస్తవానికి కృష్ణనామ మాధుర్యాన్నంతా రాధ పొందగలిగింది. లక్ష్యార్థం మీద తన దృష్టిని నిలిపి ఆనందం పొందింది. అందువలన నాకు తెలిసినంత, నేను పొందినంత మాధుర్యాన్ని ఎవరూ పొందలేరు కదా అనుకుంది. శ్రీకృష్ణ పరమాత్ముడు ఆమె అహంకారాన్ని తొలగించాలని నిర్ణయించుకున్నాడు.

"ఈ రోజు ఏకదశి కదూ! రాధా! నీవు పంచభక్ష్య పరమాన్నాలు పళ్ళెములో పెట్టుకుని, యమునను దాటి యమునకు అవతల చూతఫల వృక్షములు ఉన్న తోటలో తపస్సు చేసుకుంటున్న దూర్వాస మహాముని దగ్గరకు వెళ్ళి, అవన్నీ ఆయన కుక్షిలో వేస్తే ఎంతో పుణ్యం వస్తుంది. వెళ్ళిరా." అన్నాడు కృష్ణపరమాత్మ. 'ఆ యమునా నది పొంగి పొరలుతూ ఉంటుంది. దానిని దాటటం ఎలా? కృష్ణయ్య అన్నీ ఇలాగే చెబుతాడు' అనుకుంది రాధ. "అస్ఖలిత బ్రహ్మచారియైన కృష్ణపరమాత్మ దారి ఇమ్మన్నాడు' అని చెప్పు యమున ఇస్తుంది" అని చెప్పాడు కృష్ణపరమాత్మ.

'తమ సంగతంతా నాకు తెలుసుగా! అంతమంది భార్యలున్నారే, ఆజన్మబ్రహ్మచారి అంటాడేమిటి?' అనుకుంది రాధ మనస్సులో. అయినా కృష్ణుడు చెప్పింది చేయటం ముఖ్యం కదా! అనుకుని, అన్నీ తీసుకుని యమున ఒడ్డుకు వెళ్ళి, 'అస్ఖలిత బ్రహ్మచారియైన కృష్ణపరమాత్మ దారి ఇమ్మన్నాడు' అనేసరికి యమున మనస్సులో 'ఇంకా కృష్ణుడికి గుర్తున్నాను అంతే చాలు' అనే ఆనందంతో దారియిచ్చి ధన్యురాలిని' అని యమునమ్మ అనుకుంది. రాధ యమున దాటగానే మరల పొంగి పొరలుతోంది.

రాధ తిరిగి వస్తూ 'అయ్యో! ఇప్పుడు ఎలా యమునను దాటటం' అనుకుంది. అది గ్రహించిన ముని "నిత్య ఉపవాసియైన దుర్వాస మహర్షి దారి ఇమ్మన్నాడు' అని అడుగు దారి ఇస్తుంది" అని చెప్పాడు. రాధ తన మనస్సులో 'ఇప్పుడేగా నేను యిచ్చినవన్నీ తీసుకుని తిని

నిత్యోపాసి అంటాడేమిటి?' అనుకుంటూ, యమున దగ్గరకు వచ్చి మహర్షి చెప్పినట్లే అడుగుతుంది. రాధ అడగగానే, మనస్సులో 'అంత పెద్ద మహర్షికి నేను గుర్తున్నానే!' అని ఆనందంతో యమున దారి యిస్తుంది. రాధ ఇవతలి ఒడ్డుకు చేరగానే మరల పొంగిపొరలుతోంది.

ఇంటికి చేరిన రాధ, తన సందేహాలు తీర్చుకునేందుకు శ్రీకృష్ణ పరమాత్మ దగ్గరకు వెళ్లింది. "నీ మనస్సు ఎవరిది?" అని కృష్ణుడు రాధను ప్రశ్నించాడు. "ప్రాపంచిక విషయాలన్నీ శరీరానికేగాని, మనస్సుకు కాదు. కృష్ణుని మనస్సు రాధది, రాధ మనస్సు కృష్ణునిది. అసలు మనస్సే లేని వాడికి అవన్నీ ఎక్కడివి? అందువలన కృష్ణపరమాత్మ ఆజన్మబ్రహ్మచారి. దూర్వాసమహర్షి నిత్యోపవాసి" అన్నాడు కృష్ణపరమాత్మ. 'నా అజ్ఞానాన్ని తొలగించి, నా అహంకారాన్ని పోగొట్టారు స్వామీ!' అని రాధ కృష్ణుడికి ప్రణమిల్లింది. అహంకారం తొలగగానే ఎంతో ఆనందాన్ని పొందింది రాధ" అన్నారు శ్రీబాబు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**ఆగస్ట్ 2019**

15 గురు - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - ఉదయం 11 గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

23 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

25 ఆది - శ్రీగురుదశమి - ఉదయం 11గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

**సెప్టెంబర్ 2019**

2 సోమ - వినాయక చవితి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

11-9-19 నుండి 15-9-19 శ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశాలు.

13 శుక్ర - భాద్రపద పౌర్ణమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

24 మంగళ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

# మన నిత్య ప్రార్థనలోని న్యాయాలు

- మధుప

మన ఆశ్రమ నిత్య ప్రార్థనలో జాగ్రత్తగా గమనిస్తే, మన గురుదేవులు బోధించిన మూడు న్యాయాలు కనిపిస్తాయి. మన ప్రార్థనలో ఆరు పేరాలు వున్నాయి కదా.

ఇందులో మొదటి రెండు పేరాలు - సత్యసుందర స్వరూపుడైన పరమేశ్వరుని చూసి, మనం కూడా సత్యాన్ని, పవిత్రతను, నిర్మలతను అలవరచుకోవటం, అలాగే ఆయన అవ్యాజకరుణను చూసి, మనం కూడా ఎదుటి వారిలో తప్పులను ఎంచకుండా వారికి మంచినే చేయడం. - ఇది తల్లికోతిని పట్టుకుని, పిల్లకోతి అదే మార్గంలో గమ్యస్థానం చేరే మర్కట కిశోర న్యాయం.

తరువాతి రెండు పేరాలు - దీనబంధువైన ఆ పరమాత్మ మనలో భక్తి, జ్ఞాన, వైరాగ్య బీజాలు నాటి, వాటిని జాగ్రత్తగా పోషించి ఫలవంతం చేయడం. అలాగే తన యొక్క పరంజ్యోతి వెలుగులో మనలను జాగ్రత్తగా సత్యమార్గంలో అమృతత్వానికి నడిపించడం - ఇది తల్లిపిల్లి తన పిల్లలను నోటకరచుకుని, జాగ్రత్తగా గమ్యస్థానానికి చేర్చే మార్జాల కిశోర న్యాయం.

ఇక చివరి రెండు పేరాలలో - ఆ దేవదేవుని పాలనలో సర్వజీవ సమభావన సాధించి, ఆ ప్రభువునే చూస్తూ, ఆయన నామాన్నే జపిస్తూ, ఆయనగానే మారిపోవడం - ఇది తుమ్మెద ఝుంకారాన్ని వింటూ, దానినే చూస్తూ, కీటకం తానూ దాని స్వరూపాన్నే పొందే భ్రమరకీటక న్యాయం.

***పరమాత్మ తత్త్వం ఒక్కటే.***
***ఏ పేరుతో పిలిచినా, ప్రార్థించినా ఫలితం ఒక్కటే.***
***పరమాత్మకు ప్రతిరూపమైన సద్గురువు చరణార విందములను***
***ఆశ్రయించిన వారికి లభించే ఫలితం కూడా అదే!***

- శ్రీ కాళీబాబు

# భక్త వెంకన్న

- మధుప


నాకు కొంచెం దాహం ఇవ్వగలవా?
ఇదిగోండి స్వామీ! మేక పాలు.
ఇందుకు ప్రతిగా నీకు ఏమైనా ఇవ్వాలనుంది వెంకన్నా!


నాకు దేవుని చూడాలనుందయ్యా! అందుకు ఏదైనా మంత్రం ......
ఇంత చదువుకున్న నాకే దిక్కు లేదు, వీడా దేవుని చూసేది? హుఁ!
బొల్లి గద్దనెక్కిన ఓ నల్లనయ్యా! వచ్చి ఈ పాయసం తినిపో.


బొల్లి గద్ధనెక్కిన ఓ నల్లనయ్యా! వచ్చి ఈ పాయసం తినిపో.
ఎన్ని సార్లు పిలిచినా రావేమయ్యా? నువ్వు వెంటనే రాకపోతే నేను ఇప్పుడే నా తల బాదుకుని చనిపోతాను.


నీ చేతి పాయసం అమృతంలా ఉంది వెంకన్నా!
రోజూ నా తల బాదుకోకుండా పిలవగానే రండి స్వామీ!
అలాగే వెంకన్నా! తప్పకుండా.


ఎన్నాళ్ళకి మిమ్మల్ని మళ్ళీ చూసాను గురుదేవా! మీ కృపతో నాకు రోజూ స్వామి దర్శనం ఇస్తున్నారు. ఈ ఆనందం అంతా మీ దయే.
ఇదెలా సాధ్యం? అసలు నేనిచ్చింది మంత్రమే కాదే? ఇదేదో చూడాల్సిందే.
చాలా సంతోషం నాయనా! నేను రేపటిదాకా ఇక్కడే ఉంటాను.
వెంకన్నా! రోజూ నాకి శ్రమ లేకుండా రేపు నిన్ను నాతో వైకుంఠానికి తీసుకువెళ్తా.
వెంకన్న ఎవరితోనో మాట్లాడుతున్నాడు కానీ నాకెవరూ కనబడట్లేదే?
అలాగే స్వామీ!


రేపు స్వామి నిన్ను గరుడవాహనం మీద ఎక్కించుకున్నాక నీ కాళ్ళు పట్టుకుని నేనూ వస్తాను. నన్ను రానిస్తేనే నువ్వు వస్తానని స్వామికి గట్టిగా చెప్పు.
అలాగే గురుదేవా


వెంకన్నా! ఈ పండితుడు మోసగాడైనా నీ పాదాలు పట్టుకోగానే అతని అహంకార మమకారాలు నశించి వైకుంఠానికి అర్హుడైనాడు.

# వచ్చిన దారినే పో! - శ్రీ రమణులు

'మోక్షమార్గం తెలపండి నాకు' అంటూ గొప్ప ఆవేశంతో అడిగాడు, కొన్ని వందల మైళ్ళ దూరం నుండి వచ్చిన ఒక యువకుడు. భగవాన్ ఏమి చెబుతారో విందామని భక్తితో ఆ యువకునితో పాటు సన్నిధిలోని భక్తులు చెవులు రిక్కించి కూర్చున్నారు. భగవాన్ ఆ యువకుని వంక తీక్షణంగా కొంతసేపు చూసి, 'వచ్చిన దారినే పో!' అని చిరునవ్వు నవ్వారు. ఆ యువకుడు ఆశాభంగంతో, పరాభవంతో ఉడికిపోతూ చర్రున లేచి, బయటకు వెళ్ళిపోయాడు. భక్తులు కూడా ఇదేమిటా భగవాన్ ఇలా అనేశారు' అని నొచ్చుకున్నారు.

ఆ యువకుడు తిట్టుకుంటూ ఆశ్రమ ఆవరణం దాటుతున్నాడు. ఇంతలో ఒక వృద్ధుడైన భక్తుడు ఎదురయి ఆ యువకుని నుండి సంగతి, సందర్భము విని, 'నాయనా! భగవాన్ నీకు మోక్ష మార్గాన్ని కరుణించారు. అర్థం చేసుకోలేక ఆగ్రహిస్తున్నావు' అంటూ విశదీకరించారు ......

"ఆత్మ నుండి 'నేను' అనే తలంపు పుట్టి దేహం లోనికి వచ్చి దేహమే తానని తలుస్తుంది. ఇదియే బంధం, సంసారం, మోక్షకామి, 'నేను' అను తలంపును అంతర్ముఖపరచి, తిరిగి వచ్చిన దారి వెంటే వెళ్ళి, ఆత్మస్థానంలో కలవటమే మోక్షం." ఈ విపులీకరణకు ఆ యువకుడు పశ్చాత్తాపంతో కూడిన ఆనందభాష్పాలు రాల్చాడు.

గమనిక

***హరేరామ నామ పంచమ సప్తాహము***

***క్షీరారామం, పాలకొల్లులో***

***ది.17-9-19 నుండి 24-9-19 వరకు జరుగును.***

***కార్యక్రమము తేదీలలో మార్పును***

***గమనించగలరు!***

## ప్రత్యేక ప్రతిపత్తి - మధుప

మనలో ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన అవయవం ఒకటున్నది. మన శరీరంలో ప్రతి భాగానికి స్వయం రక్షణ వుంది. వుదాహరణకు కంటిలో దుమ్ము పడబోతుంటే మనకు తెలియకుండానే రెప్పలు మూసుకుంటాయి. అలాగే చెవిలో పడిన దుమ్ము, కీటకాలను గులిమి బయటకు త్రోసివేస్తుంది. మన శరీరంలో ప్రవేశించిన రోగ క్రిములను మనకు తెలియకుండానే శరీరమే పోరాడి అణిచివేస్తుంది.

కానీ ఈ ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన మనస్సు మాత్రం ఏ విషయంలోనూ తనను తాను రక్షించుకోదు. ఒకసారి మనసులోకి ప్రవేశించిన చెడు దృశ్యంగాని, శబ్దం గానీ దానంతట అది బయటకు పోదు. వాటిని వదిలించుకోవడానికి చాలా సాధన అవసరం అవుతుంది. మిగిలిన దేశానికి శత్రువులు బయటనుండి వస్తే కాశ్మీరుకు శత్రువులు లోపలే వున్నట్లు, మిగిలిన దేహానికి శత్రువులు బయటనుండి వస్తే, మనస్సుకు శత్రువులు మాత్రం లోపలే వుంటారు.

ఈ ప్రత్యేక ప్రతిపత్తిని బయట ప్రభుత్వాలేవీ రద్దుచేయలేవు. దాని రద్దుకు మన ప్రభువే మనకు వివేక వైరాగ్యాలనే రెండు సాధనాలను ఇచ్చారు. మనస్సుకు ఈ ప్రత్యేక ప్రతిపత్తి పోయి మిగిలిన శరీరం లాగా తనను తాను రక్షించుకునే శక్తి కలిగేవరకు నిరంతర విచారణ ద్వారా ఈ వివేక వైరాగ్యాలను పటిష్ఠపరచుకోవలసినదే.

### శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసియైన శ్రీమతి వేగేశ్న రామలక్ష్మిగారు 13-7-2019 శనివారంనాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 55 సంవత్సరాలు. వీరు గత కొద్ది సంవత్సరాలుగా ఆశ్రితాశ్రయాన్ని ఆశ్రయించి వున్నారు. వీరు కొద్దికాలం ఎంక్వైరీ ఆఫీసులో తమ సేవలను అందించారు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## శ్రీ బాబూజీ మహరాజ్ అనుగ్రహముతో
## శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పర్యవేక్షణలో జరుగనున్న 'హరేరామ నామ సంకీర్తన, సత్సంగ సప్త సప్తాహాలు'

పైన వివరించిన కార్యక్రమాలు శ్రీఅన్నవరం శ్రీ సత్యదేవుని సమక్షంలో ప్రారంభమై, పంచారామాలలో సప్తాహములు చేసుకుని చివరిగా శ్రీకాళీవనాశ్రమంలో సంపూర్ణం చేయబడతాయి. ఈ విషయం భక్తులందరికి కరపత్రములు (పేంప్లెట్స్) ద్వారా తెలియపరచటమైనది.

కార్యక్రమ వివరములు : తె జా 4 గం.లకు సుప్రభాతం; 4గం 30 ని.లకు ప్రార్థన; 9గం.లనుండి 10 గం.ల వరకు శ్రీశ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనము;11 గం.లకు మరియు సాయంత్రం 6 గం.లకు శ్రీ మాతాజీ మరియు మహాత్ముల అభిభాషణము ఉంటాయి. ఈ సప్తాహాలలో అఖండ హరేరామ నామ సంకీర్తన శ్రీ శివాజీ, కామేపల్లివారి ఆధ్వర్యంలో జరుగును.

సప్త సప్తాహముల వివరములు : 1. ది.23.3.2019 నుండి ది,30.3.2019 వరకు అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ; *2. ది. 24.04.2019 నుండి ది. 01.05.2019 వరకు చాళుక్య కుమారారామం, శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామి, సామర్లకోట;* 3, ది. 20.05.2019 నుండి ది.27.05.2019 వరకు భీమారామం, మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ద్రాక్షారామం ; **4. ది.05.08.2019 నుండి ది.12.08.2019 వరకు సోమారామం, ఉమాసోమేశ్వర జనార్ధనస్వామివార్ల దేవస్థానం భీమవరం;** 5. ది.17.09.2019 నుండి ది.24.09.2019 వరకు క్షీరారామం, శ్రీ పార్వతీ సమేత క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, పాలకొల్లు; 6.ది.18.10.2019 నుండి ది.25.10.2019 వరకు అమరారామం, శ్రీ బాలా చాముండేశ్వరి సమేత శ్రీ అమరేశ్వరస్వామి ఆలయం ప్రాంగణం అమరావతి; మరియు 7. ది.15.11.2019 నుండి ది.22.11.2019 వరకు శ్రీగురు ఆరామం, శ్రీ కాళీవనాశ్రమం (నంబూరు)లో నిర్వహించబడును.

భక్తులందరూ బహు సంఖ్యాకంగా విచ్చేసి, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయమని ప్రార్థిస్తున్నాము. భారీ ఎత్తున జరిగే ఈ కార్యక్రమాలు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినవి. కావున భక్తులు ఈ విషయాన్ని గుర్తించి, ధన రూపంలోను, అమూల్యమైన సేవలరూపంలోను తమ సహాయ సహకారాలను అందించమని భక్తులను ప్రార్థిస్తున్నాము. భక్తులు ఇచ్చే విరాళాలకు ఐ.టి యాక్ట్ 80 జి రాయితి లభిస్తుందని తెలియజేస్తున్నాము.

పూర్తి వివరాలకు ట్రస్ట్ ఆఫీస్ 0863 - 2293564;
కె.మురళీమోహన వర్మ సెల్ - 93983 34345 మరియు
కుమార స్వామి రాజా సెల్ - 93465 35357లను సంప్రదించగలరు.

# మరువకురా మాధవుని స్మరణము

(శ్రీ మాతాజీ ప్రసంగాల నుండి) -రమణ ప్రసాద్

శరీరాన్ని మరచి, మనస్సును ఏకాగ్రత చేయటమే ధ్యానం. నిద్రలో మనస్సు అణిగి ఉంటుంది. కాని అది ధ్యానం కాదు. జాగ్రదవస్థలో ఆ స్థితి రావాలి. అదే నిజ జాగ్రత స్థితి. ఒకాయన సముద్రపుటొడ్డున కూర్చుని వున్నాడు. అక్కడికి ఇంకొక వ్యక్తి వచ్చి, "ఫలానా ఆయన ఇటు వెళ్ళాడా?" అని అడిగితే, "నాకు తెలీదు" అంటాడు - అంటే అతనికి ఏకాగ్రత కుదిరిందన్నమాట. ఏకాగ్రత కుదరక పోవటానికి కారణం మనలో ఉన్న కామ క్రోధాదులనే శత్రువులు, మనని ఆకర్షణకు లోబరిచే ఇంద్రియాలు. గురువు ఉపదేశించిన విధంగా సాధన చేస్తే ఒక తృప్తి. మనస్సు నిలబడటంలేదంటే దానికి కారణం మనం చేసే కర్మలే. మనస్సు మనలో మరో ప్రపంచాన్ని సృష్టిస్తుంది. 24 గంటలలో 23 గంటలు ప్రపంచ విషయాలలో మునిగితే, మనస్సు నిలబడుతుందా? కొద్ది సేపు ఏకాంతంగా కూర్చో. మనస్సులో ఏ ఆలోచనలను రానీయకు. తరువాత నీ స్వదర్మం నిర్వర్తించు. చేయించేవాడొకడున్నాడు, అతడే భగవంతుడనే ధ్యాసతో ధ్యానం చెయ్యి. 'నేను చేస్తున్నాను, నేను కాబట్టి చేస్తున్నాను' - అనే అహంకారం సత్ఫలితాలను ఇవ్వదు.

'కానివి పోనివి కర్మముల్ జేసి కాలుని బారిని పడెదవేలరా!"

కానివి పోనివి కర్మలు చేసి ఉత్తమమైన మానవజన్మ వృధా చేసికొంటున్నాడు మానవుడు. కదిలే మనస్సుని గురుదేవుల సన్నిధానం వైపు తిప్పాలి. ఇక్కడ మన గురుదేవులు, శ్రీమన్నారాయణ పాద ధ్యానము మరువకుమురా ! అని హెచ్చరిస్తున్నారు. ఆయన శ్రీమన్నారాయణునికి వేరైతే కదా! గురుడే హరిరా! హరియే గురుడు రా! అని ఉద్బోధిస్తున్నారు. లక్ష్యార్థం పొందామంటే చాలదు. దానిని మథించాలి. అరణ్యంలో ఎన్నో క్రూర మృగాలు ఉంటాయి, వాటిని ఒక్కొక్కదానిని పారద్రోలటం కష్టం. అడవికి నిప్పంటిస్తే అవి పలాయనం చిత్తగిస్తాయి. మనలో పేరుకొన్న వాసనలు రహితం కావాలంటే శ్రీ గురుదేవులు ప్రసాదించిన లక్ష్యార్థాన్ని సాధించాలి. మనం చేసే ఆలోచనలు ఈర్ష్యాసూయల రహితంగా ఉండాలి. **"అద్వేష్టా సర్వ భూతానాం, మైత్రః కరుణ ఏవచ"** అని చెప్తోంది భగవద్గీత. అటువంటి సాధకుడిని, "వాడు మనవాడయ్యా! వదిలి పెట్టండి" అంటాడు భగవానుడు. భగవంతుడు సర్వ వ్యాపకుడైనప్పుడు ద్వైతభావం ఎక్కడనించి వస్తుంది? మనం ప్రవృత్తిమార్గం నుండి నివృత్తి మార్గానికి రావాలి. అప్పుడు నీ మాట స్తోత్రమవుతుంది. సమాధి

స్థితిలో జాగ్రదావస్థలో నీ మనస్సు ప్రశాంత స్థితిని పొందుతుంది.

ఒకరోజు శ్రీబాబు అందరినీ ధ్యానం చెయ్యమన్నారు, తరువాత ఒక్కొక్కరినీ, 'నీ మనస్సు ఎలా ఉంది?' అని అడిగారు. ఒక మామ్మగారు, 'అంతటా నువ్వే. నువ్వు ప్రసాదం ఇస్తున్నట్లు, నేను తీసికొంటున్నట్లు భావన కలిగింది' అన్నది. అంటే అక్కడ దేవుడు భిన్నంగా ఉన్నాడా? అక్కడ ఉన్నది నీ దేవుడే. అంతకన్నా ఏం కావాలి? ఏ ఆలోచన వచ్చినా, "నా గురుదేవుడు చేయిస్తున్నాడు. నా గురుదేవుడే నన్ను నడిపిస్తున్నాడు" అనే భావం పెంపొందించుకోవాలి. ఈర్ష్యాసూయలు ఎప్పుడు రహితమవుతాయో, అక్కడ మనస్సు ఆనంద స్థితిని పొందుతుంది.

ఒకే గురుపాదాన్ని ఆశ్రయించాలి. గురుదేవులు చెప్పినది ఆచరించాలి. **"మీ హృదయబాబు"** అన్నారు శ్రీగురుదేవులు. మనస్సును అంతర్ముఖం చేసికొని స్వామిని దర్శించాలి.

ఇక్కడ స్వామి మనకు ఏమి బోధిస్తున్నారంటే- మరువకురా మాధవుని స్మరణము, హరియించునురా భవబంధములే!

శ్రీగురుదేవులు మనందరికి అట్టి శక్తిని భక్తిని ప్రసాదించి కాపాడుగాక సుఖీభవ।

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**ఆగస్ట్ 2019**

15 గురు - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - సాయంత్రం 5గం. లకు శ్రీసద్గురు పాదపూజ

23 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - సాయంత్రం 5గం. లకు శ్రీసద్గురుపాదపూజ.

25 ఆది - శ్రీగురుదశమి - సాయంత్రం 5గం. లకు శ్రీసద్గురు పాదపూజ

**సెప్టెంబర్ 2019**

2 సోమ - వినాయక చవితి - సాయంత్రం 5గం. లకు శ్రీసద్గురు పాదపూజ

13 శుక్ర - భాద్రపద పౌర్ణమి - సాయంత్రం 5గం. లకు శ్రీ సద్గురు పాదపూజ.

24 మంగళ - శ్రీగురుదశమి - సాయంత్రం 5గం. లకు శ్రీసద్గురు పాదపూజ.

# నామ మహిమ

- గాలి జగదీశ్

భక్త తుకారాం సదా రామనామ స్మరణ పైకి వినిపించేలా చేస్తూ వుండేవాడు. అయితే రాజ పురోహితుడు 'భగవన్నామమును మడి కట్టుకున్నప్పుడు మాత్రమే జపించాలని, ఇతర సమయాలలో ఉచ్ఛరిస్తే దోషం ఆవరిస్తుందని' ఊరూవాడా చాటించేవాడు.

ఒకసారి తుకారాం ఊరి అవతల బహిర్భూమికి వెడుతూ రామనామ జపం బిగ్గరగా చేయసాగాడు. ఆదే సమయానికి రాజ పురోహితుడు అటువైపుగా రావడం జరిగింది. ఆ అపవిత్ర స్థలంలో రామనామ జపం వినబడగానే పురోహితుడు రెండు చెవులు గట్టిగా మూసుకొని, కోపంగా 'తుకారాం! నువ్వు ముందు నోర్మూయ్!' అని అరిచాడు. తుకారాం నోరు అయితే మూశాడు కానీ, మనస్సు మూయలేదు. దాన్ని మూయించడం ఎవరి తరం? వెంటనే తుకారాం రోమ రోమం నుండీ రామనామ జపం శబ్దం మిన్నుముట్టేటట్లుగా మారుమ్రోగింది! ఆ పురోహితుడి గుండెలు గుభేలు మన్నాయి. వెంటనే తుకారాం పాదాలపై పడి క్షమాపణ కోరుకున్నాడు రాజపురోహితుడు. తుకారాం తన నోటి మీద నుండి చెయ్యి తీసివేశాడు. శబ్దం నెమ్మదైపోయింది. తిరిగి యథా ప్రకారం నామస్మరణ సాగిస్తూ తుకారాం ముందుకు సాగిపోయాడు. ఆనాటి నుండి రాజపురోహితుడు బుద్ధి తెచ్చుకుని, తన దుష్ట ప్రచారం మానివేశాడు.

గతజన్మలో నామదేవుడు చేయువలసిన నామస్మరణ కొన్నికోట్లు మిగిలివుండగా, ఆయనే తుకారాంగా జన్మించాడని ఇతిహాసం. అందుకనే కలియుగంలో సద్గురువులు అందరూ నామస్మరణచే తరించవచ్చు సులభంగా అని పదేపదే హెచ్చరిక చేస్తున్నారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

***ఆగస్ట్ 2019***

1 గురు - అమావాస్య

3 శని - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

9 శుక్ర - వరలక్ష్మీ వ్రతం

15 గురు - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

23 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - కలశస్థాపన, రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్తసమారాధన. రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ.

24 శని - ఉదయం 11గం. సామూహిక రాధాకృష్ణ పూజలు. భక్తసమారాధన.

25 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన, ఏకాహం సంకీర్తన.

26 సోమ నుండి సెప్టెంబర్ 1 ఆదివారం వరకు మౌన ధ్యాన సప్తాహ శిబిరం.

29 గురు - మాసశివరాత్రి

30 శుక్ర - అమావాస్య

***సెప్టెంబర్ 2019***

2 సోమ - వినాయక చవితి - తె.జా 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, ఉదయం 11గం. సామూహిక గణపతిపూజలు, భక్తసమారాధన.

5 గురు - ఉపాధ్యాయ దినోత్సవం.

13 శుక్ర - భాద్రపద పౌర్ణమి - శ్రీ సద్గురుపాదపూజ.

24 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

27 శుక్ర - మాసశివరాత్రి.

28 శని - అమావాస్య

29 ఆది - శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం.

# భజ  గోవిన్దమ్ - రమణ ప్రసాద్

కేరళ రాష్ట్రంలో పూర్ణానది ఒడ్డున, కాలడి అనే గ్రామంలో శివగురు, ఆర్యాంబ అనే నంబూద్రి బ్రాహ్మణ దంపతులు సంతానంకోసం శివుని ప్రార్థించగా, శివుడు వారికి ప్రత్యక్షమై, తానే వారికి కుమారుడుగా పుడతానని వరమిస్తాడు. వైశాఖ శుద్ధ పంచమి నాడు పునర్వసు నక్షత్రాన క్రీ.పూ 509లో వారి గర్భాన జన్మించినట్లు తెలుస్తోంది. ఆ బాలునికి 'శంకరుడు' అని నామకరణం చేశారు. ఆ బాలుడు 8వ ఏటనే వేదాలలో పాండిత్యం సంపాదించి,12వ ఏట సర్వ శాస్త్రాలను మథించి, 16వ ఏట ఉపనిషత్తులకు భాష్యాన్ని వ్రాసి, 32వ ఏట భౌతిక శరీరాన్ని త్యాగం చేశాడు.

భారత దేశం సంక్షోభంలో ఉన్న తరుణంలో ఆయన అవతరించారు. ఆయన ఒక వ్యక్తి కాదు. ఒక సంస్థ. అద్వైత మతాన్ని స్థాపించి నాస్తిక వాదాన్ని తరిమి కొట్టారు. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు పర్యటించి ప్రజల జీవన విధానాన్ని మార్చారు. వారు జీవించింది 32 ఏళ్లే ...



శ్రీ శంకరులు శిష్యులతో కాశీలో ఒక వీథిలో వెళ్తున్నారు. ఒక ముసలి పండితుడు వ్యాకరణ సూత్రాలు వల్లె వేయటం చూశారు. ఆ పండితుని మీద జాలి కలిగి, అతనితో, "ఈ వ్యాకరణ సూత్రాలు మరణ సమయంలో పని చెయ్యవు. నీ బుద్ధిని గోవిందునిపై మరల్చు" అని ఉపదేశించారు. ఈ మొదటి శ్లోకం తరువాత 12 శ్లోకాలు చెప్పారు. ఆయన 14 మంది శిష్యులు ఒక్కో శ్లోకాన్ని చెప్పారు. ఆ తరువాత శ్రీ శంకరులు మోక్షాన్ని కోరే ప్రతి వ్యక్తిని ఆశీర్వదిస్తూ 4 శ్లోకాలు చెప్పారు.

సంసారమనే నిద్రలో ఉన్నవారికి తీయటి కొరడా (ముద్గర)

దెబ్బలు ఈ శ్లోకాలు.

ఈ గ్రంథం అద్వైత సారం. నీటి బుడగ వంటి తాత్కాలికమైన ప్రపంచ విషయాలపై మోహాన్ని వదిలెయ్యాలి. బ్రతుకు ఎంత తొందరగా మృత్యుముఖంవైపు తీసికొని వెళ్తోందో గ్రహించాలి. ధనం, స్త్రీలపై కోరిక, సంసారం, కుటుంబం, బంధువులు, నేను-నాది - వీటి వెనుక ఉన్న మాయ గురించి ఈ శ్లోకాలలో వివరించబడింది.

***1. భజ గోవిందం భజ గోవిందం***
***గోవిందం భజ మూఢమతే।***
***సంప్రాప్తే సన్నిహితే కాలే***
***నహి నహి రక్షతి డుకృ ఞ్కరణే॥***

హృదయంలో భగవద్భావన నింపుకోవాలి, అంతేకాని విషయాలు కాదు. వ్యాకరణ సూత్రాలను వల్లె వేయటాన్ని శాస్త్ర పఠనం అంటారు. ఈ వ్యాకరణ సూత్రాలు మరణ సమయం ఆసన్నమైనప్పుడు రక్షించలేవు. ఛాందోగ్యోపనిషత్తులో, నారదుడు, సనత్కుమారుని ఆశ్రయించి జ్ఞానం బోధింపమని అడుగుతాడు. ఆయన "నీకేమి తెలుసో ముందు చెప్పు. నీకు తెలియనిది నేను ఉపదేశిస్తాను" అంటాడు. నారదుడు తనకు వచ్చిన శాస్త్రాలన్నీ ఏకరువు పెడతాడు. వాటిలో వ్యాకరణ, జ్యోతిష్య, ఖగోళ శాస్త్రాలుకూడా ఉన్నాయి. వ్యాకరణ శాస్త్రాధ్యయనం వల్ల మానవునికి ముక్తి లభించదు. జీవిత పరమార్థం తెలుసుకోవటమే ఏకైక లక్ష్యంగా ఉండాలి. జీవన్ముక్తి పొందినవాడికి చావు అంటే దేహాన్ని విడిచిపెట్టటం మాత్రమే - అని ఉపదేశిస్తాడు సనత్కుమారుడు.

భగవద్గీతలో మరణ సమయంలో భగవంతుడిని స్మరిస్తే ముక్తి లభిస్తుంది అని చెబుతాడు భగవానుడు (8/5). ' అంత్యకాలేచ' అంటే అంత్యకాలం ఎప్పుడు వస్తుందో మనకు తెలియదు కాబట్టి అనుక్షణం భగవంతుడిని స్మరించాలి.

-సశేషం

# అహంకారం

- పాలూరి కాళీప్రసాద్

సామాన్య పరిభాషలో అహంకారం అంటే గర్వం, దర్పం అనుకుంటాం. కానీ వేదాంత పరిభాషలో అహంకారం అనే మాట రెండు వేరు వేరు అర్థాలలో ఉపయోగింపబడుతుంది. మొదటిది అహంకార, మమకారాలలో వుండే అహంకారం. 'నేను' అనే భావన ఈ అహంకారం. ఇందులో మళ్ళీ రెండు రకాలు వున్నాయి. అవి కర్తృత్వ అహంకారం. భోక్తృత్వ అహంకారం. ఏదైనా ఒక పని చేయవలసి వచ్చినప్పుడు ఆ పనిని తన మీద వేసుకోవడం కర్తృత్వ అహంకారం. అంటే 'ఈ పని నేను చేస్తున్నాను' అనుకోవటం అన్నమాట. అయితే కేవలం 'నేను చేస్తున్నాను, లేదా చెయ్యగలను' అని అనుకోవటం మాత్రమే అహంకారం కాదు. 'ఈ పని నేను చెయ్యలేను, లేదా నాకు చేతకాదు' అనుకోవటం కూడా కర్తృత్వ అహంకారమే. అంటే బాధ్యతను భగవంతుని మీద వదిలి పెట్టకుండా తన మీద వేసుకోవడం అన్నమాట. నిజానికి మనమందరం ఆ భగవంతుని చేతిలో పనిముట్లమే. మనం కాకపోతే ఆ పని ఇంకొకరు చేస్తారు. ప్రపంచంలో ఏదీ ఎవరి కోసమూ ఆగదు. మనం వున్నా, లేకపోయినా ఈ ప్రపంచం యథావిధిగా నడిచిపోతూనే వుంటుంది. లేనిపోని కర్తృత్వాన్ని మీద వేసుకుని సతమతమయ్యేకంటే హాయిగా భారాన్ని భగవంతునిపై వేసి మన ధర్మాన్ని మనం ఆచరించడమే ఉత్తమం. అప్పుడు దాని ఫలితం మనకు కర్మ రూపంలో అంటదు.

ఇహ 'ఈ పనికి ఫలితం నేనే అనుభవించాలి' అనుకోవటం భోక్తృత్వ అహంకారం. చాలామందిని చూస్తూంటాం. 'ఈ పనిలో పుణ్యం అంతా నాకే వచ్చేయాలి. ఇంకెవరికీ దక్కనివ్వను' అన్నట్లుగా ప్రవర్తిస్తూ వుంటారు. అయితే మన అంతిమ లక్ష్యం మోక్షం అయినప్పుడు మనం మధ్యలో వచ్చే ఈ పాప పుణ్యాలను పట్టించుకోకూడదు. మన కర్మ అకౌంట్‌లో పాపం బ్యాలెన్స్ వున్నా, పుణ్యం బ్యాలెన్స్ వున్నా మనం తిరిగి జన్మకు రాక తప్పదు. కేవలం పాప పుణ్యాలే కాదు, మనం చేసే ప్రతి పని యొక్క ఫలితం పైనా ఏమాత్రం దృష్టి పెట్టినా అది భోక్తృత్వ అహంకారమే. క్షణికానందం కోసం పాపకర్మలు చేసి, దీర్ఘకాలంలో దానివల్ల వచ్చే కష్టాలు,

బాధలు మాత్రం తనకు వద్దు అనుకుంటూ వుంటాడు మానవుడు. ఇది కూడా భోక్తృత్వ అహంకారవే. మనం చేసే కర్మలన్నింటినీ భగవదాదేశంగా భావిస్తూ వాటి బాధ్యతలను, ఫలాన్ని కూడా ఆయనకే వదిలిపెట్టి, శ్రద్ధతో చేస్తే అదే కర్మయోగం అవుతుంది. మోక్షానికి దారి తీస్తుంది.

ఇక పైన చెప్పుకున్నట్లు రెండవ అర్థంలో అహంకారం అనే మాట అంతఃకరణ చతుష్టయంలో భాగంగా వస్తుంది. అంటే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అన్నమాట. వీటిలో మనస్సు సంకల్పిస్తే, చిత్తం రికార్డు చేస్తుంది. బుద్ధి నిర్ణయిస్తే, అహంకారం ఆ నిర్ణయాన్ని అమలులో పెడుతుంది. దీనినే పురుషకారం, లేదా పురుషప్రయత్నం అని కూడా అంటారు.

మనస్సు, బుద్ధి, చిత్తము కంటికి కనబడవు. కానీ, వాటి నిర్ణయాలు అహంకారము ద్వారా వ్యక్తమై, కర్మేంద్రియాల ద్వారా ఆ పని అమలులో పెట్టబడుతుంది. ఈ అహంకారమే లేకపోతే సృష్టిలో ఏ ప్రాణీ, ఏ పనీ చేయలేదు. పైన చెప్పుకున్న మొదటిరకం అహంకారం మనకు మోక్షానికి అడ్డంకే. కానీ, ఈ రెండవ రకం అహంకారం మనకు ప్రతిబంధకం కాదు. మనస్సును, బుద్ధికి స్వాధీనం చేసి, ఆ బుద్ధిని పరమాత్మ యందు నిలిపితే, అప్పుడు ఈ అహంకారం ద్వారా చేయబడే క్రియలన్నీ కూడా లోకహితార్థమే అవుతాయి.

శ్రీబాబూజీ మహరాజ్ వారు ఈ రెండు అహంకారాలకు వేరు వేరు చికిత్సలు చెప్పేవారు. మొదటిదైన అహంకార మమకారాలను వడ్ల గింజపై వున్న రెండు పొరలతో పోల్చేవారు. ఆ రెండు పొరలు వున్నంతకాలం ఆ వడ్లగింజ మొలకెత్తి మళ్ళీ మళ్ళీ అనేక జన్మలకు కారణం అవుతుంది. అందుకే ఈ రెండు పొరలను, అంటే అహంకార మమకారాలను తొలగించుకుంటే కానీ జన్మరాహిత్యం సాధ్యం కాదని చెప్పేవారు. పొరలు తీసివేస్తే వడ్లగింజ బియ్యపుగింజగా మారిపోతుంది కదా? ఎంత నాన బెట్టినా బియ్యపుగింజ తిరిగి మొలకెత్తుతుందా?

ఇక రెండవ అహంకారం భాగమైన అంతఃకరణ చతుష్టయం అంత చెడ్డదేమీ కాదు. దానిని పూర్తిగా తొలగించుకోవలసిన అవసరం లేదు. శరీరంతో వున్నంతకాలం అలా తొలగించుకోవటం సాధ్యం కాదు

కూడా. అయితే ప్రపంచం వైపు తిరిగి వున్న ఆ నాలుగింటిని పరమాత్మకు అభిముఖం చేస్తే అప్పుడు మనస్సు సత్యంగాను, దానికి సెక్రటరీ అయిన చిత్తం శాంతిగాను, బుద్ధి దయాస్వరూపంగాను, దానికి సెక్రటరీ అయిన అహంకారం కళంకరహితమైన ప్రేమ స్వరూపంగాను మారిపోతాయని శ్రీగురుదేవులు వివరించేవారు.

ఇలా మొదటి రకం అహంకారాన్ని నిర్మూలించుకోవడానికి, రెండవ రకం అహంకారాన్ని పరివర్తన చెందించుకోవడానికి మనవంతు కృషిని మనం చేస్తూ, ఫలితాన్ని భగవంతునికి వదిలిపెడదాం. ఎప్పుడు ఎవరితో ఏమి చేయించుకోవాలో, ఎప్పుడు ఎవరికి ఏమి ఇవ్వాలో ఆయనకే బాగా తెలుసు కదా. అయితే అహంకారాన్ని వదిలి పెట్టడమంటే సోమరితనం కాదు. అలాగే చెడ్డ పనులు చేస్తూ, 'ఇది నేను చేయడం లేదు, భగవంతుడే నా చేత ఇలా చేయిస్తున్నాడు. నేను కేవలం నిమిత్త మాత్రుణ్ణి' అని వంకలు చెప్పడం కాదు. 'నిజంగా భగవంతుడే నాతో అన్నీ చేయిస్తున్నాడు అనే భావన నిశ్చయంగా కలిగినవాడు ఎవ్వడూ చెడ్డపనులు చేయలేడు' అని శ్రీగురుదేవుల ఉవాచ.

*భగవంతుడు అవతారం దాల్చినప్పుడు మానవుని వలె ప్రవర్తిస్తాడు. సగుణ, నిర్గుణ రహితమైన ఆత్మవస్తువు సగుణంగా దర్శనమిస్తే నమ్మలేరు ... మానవుడు దేవుడెలా అవుతాడు? అని తలపోస్తారు. .... పోనీ నిర్గుణంగా దర్శనమిస్తే కనబడని వస్తువును గురించి అసలే నమ్మరు. మరి ఇంక ఎలా?*

- శ్రీబాబూజీ మహరాజ్

(గత సంచిక తరువాయి)

# కైవల్యోపనిషత్

- రేఖ

ఆ అంధకారంలో నుండి బయట పడడమంటే ఈ నామ రూపాలతో కూడిన ఉపాధిది కాదు గొప్పతనం. అనుగ్రహం వుండాలి. అసలు గొప్పతనం ఎక్కడున్నదంటే సనాతనమైన ఒకే ఒక ఆత్మశక్తి మనలో, సృష్టి అంతటిలో వుండి, అదే నడిపిస్తోంది. ఈ ఉపాధిది కాదు గొప్పతనం అనే గుర్తింపు, గ్రహింపు వుండాలి. ఎవని కృపచే చెవులు వింటున్నాయో, కళ్ళు చూస్తున్నాయో, నోరు మాట్లాడుతున్నదో దాని గురించి కేనోపనిషత్‌లోని మొదటి మంత్రంలో చెప్పబడింది.

**కేనేషితం పతతి ప్రేషితం మనః। కేన ప్రాణ ప్రథమః ప్రైతి యుక్తః।**
**కేనేషితాం వాచ మిమాం వదన్తి। చక్షుః శ్రోత్రం క ఉ దేవోయునక్తి॥**

ఇది ఒక శిష్యుడు వేసిన నిగూఢమైన ప్రశ్న. దీనిని అర్థం చేసుకుంటే నీవు ముముక్షువనీ, వైరాగ్యవంతుడవనీ, జిజ్ఞాసగల బుద్ధిశాలివని తెలుస్తుంది.

తాత్పర్యం -

మనసు దాని విషయాల మీద పడేటట్లు ఏది ప్రేరేపిస్తోంది? దేనిచేత ప్రయోగింపబడి ప్రాణం తన పనులను నిర్వర్తిస్తోంది? దేని ఇష్టాన్ని అనుసరించి మానవులు మాటలు పలుకుతారు? నిజంగా ఏ బుద్ధి కళ్ళను చెవులను నియంత్రిస్తుంది?

ఆత్మకన్న అన్యమైనదానిని అభిలషించని శిష్యుడు వేసిన ప్రశ్న ఇది. అందువల్ల ఏమని తెలుస్తోంది? ఈ ఇంద్రియాలన్నిటికీ శక్తినిచ్చేది ఒకే ఒక ఆత్మశక్తి అని తెలుస్తోంది.

ఒక ఇంద్రియం చేసే పని, వేరే ఇంద్రియం చేయలేదు. ఏ ఇంద్రియం చేసే పని ఆ ఇంద్రియమే చేయగలుగుతుంది. ఉదాహరణకు చూసే కన్ను వినలేదు. వినే చెవి చూడలేదు. పని చేసే చెయ్యి మాట్లాడలేదు. మాట్లాడే నోరు పని చెయ్యలేదు. భగవంతుడు ఎంత గొప్ప శాస్త్రవేత్త! మానవుడు తన మేధస్సు ద్వారా ఎన్నో యంత్రాలు తయారుచేయవచ్చు. ఆ మేధస్సుకి కూడా అదే ఆత్మశక్తి ఆధారం. వెనుక వుండి ప్రేరణ ఇచ్చేది ఆ శక్తియే.

-సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## బొంబాయి శాస్త్రిగారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

(గత సంచిక తరువాయి)

బొంబాయి శాస్త్రిగారు శ్రీబాబును గూర్చి విన్నారు గాని మొదట్లో వారితో పరిచయం లేదు. మహాత్ములు కూడా మానవ మాత్రులే అని వారు భావించే వారు. అన్నపూర్ణమ్మ గారికి మాత్రం పరశురామయ్యగారి ద్వారా శ్రీ బాబును గురించి తెలియటమేగాక, వారి యెడల భక్తి కూడా ఉండేది.

1966లో శ్రీ బాబు భక్తులతో ఉత్తరదేశ యాత్ర చేసి వస్తూ, తిరుగు ప్రయాణంలో బొంబాయి నగరమును దర్శించారు. ఆ సమాచారమును భక్తులెవరో శాస్త్రిగారికి ఫోను ద్వారా తెలియ జేశారు. అన్నపూర్ణమ్మ గారు శ్రీ బాబును దర్శించాలని పట్టుబట్టటం వలన, తమకు అంతగా యిష్టం లేకపోయినా, శాస్త్రిగారు రైల్వేస్టేషన్‌కు వెళ్ళి శ్రీ బాబును కేవలం మర్యాద పూర్వకంగా దర్శించారు. శాస్త్రిగారు నమస్కరించక పోయినా, శ్రీ బాబు వారికి నమస్కరించి “మీరెప్పుడూ నా వారే ” అన్నారు. శాస్త్రిగారు ఒక నవ్వు నవ్వి ఊరుకున్నారు. అదే శ్రీ బాబుతో వారి ప్రథమ సమాగమము.



తరువాత జరిగిన ఒక సంఘటన శాస్త్రిగారి కుటుంబ సభ్యులకు శ్రీబాబుపై అనన్య విశ్వాసమును కలిగించింది. యజ్ఞ నారాయణకు ఒకనాడు చాలా తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. డాక్టర్లు అది ‘అపెండిసైటిస్’ అని , 24 గంటల లోపల ఆపరేషన్ చేయాలని అన్నారు. నారాయణ మాత్రం ‘ఏమైనా సరే! నేను ఆపరేషన్ చేయించుకోను’ అని చెప్పేశాడు. కాని బాధతో మెలికలు తిరిగి పోతున్నాడు. ఏం చెయ్యాలో ఎవరికీ తోచడం లేదు.

ఆ సమయంలో నారాయణ బావమరిది బాల సుబ్రహ్మణ్యం (కుట్టి) అక్కడే ఉన్నాడు. అతనికి శ్రీ బాబుపై చెప్పలేనంత గురి. అతడు

శ్రీబాబు ఫోటోనొకదానిని నారయణకిచ్చి 'వీరు నా గురుదేవులు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపులని నాకు అచంచల విశ్వాసం ఉంది. వారు నాకు ప్రసాదించిన అనుభవాలెన్నో ఉన్నాయి. మీరు నా మాటలు నమ్మి, వారిని మనస్ఫూర్తిగా విశ్వసించి ఆ ఫోటోను చూస్తూ 'ఓం బాబు' అని స్మరించుకోండి. వారి అవ్యాజ కరుణ మీపై వర్షిస్తుందని నాకు పూర్ణ విశ్వాసమున్నది' అన్నాడు. నారాయణకు మహాత్ముల మీద, వారి శక్తులమీద నమ్మకం లేదు. కాని వేరే ఉపాయం లేదు. కనుక శ్రీ బాబు ఫోటో వంక చూస్తూ నిజంగా నాకు ఈ నొప్పి తగ్గితే నేను మిమ్మల్ని మనస్ఫూర్తిగా దైవ స్వరూపంగా నమ్ముతాను. అంతే కాదు; నేను వెంటనే వచ్చి మిమ్మల్ని దర్శించుకుంటాను' అని నిర్మల మనస్సుతో ధ్యానించటం మొదలు పెట్టాడు.

అదే సమయంలో అతని తమ్ముడు దీక్షితులుకు పరిచయం ఉన్న ఒక వ్యక్తి అక్కడకు వచ్చాడు. అతను విషయం విని "నేను షిర్డీ సాయి భక్తుణ్ణి. నాకు హెూమియో వైద్యం కొంచెం తెలుసు. నా యిష్టదైవమైన షిర్డీ నాధుని తలచుకొని నాకు తోచిన మందిస్తాను. మీరు మీ యిష్టదైవాన్ని తలచుకుని యీ మందు వేసుకోండి. రెండు డోసులిస్తున్నాను. మొదటి డోసుకు తగ్గకపోతే, రెండవ డోసు కూడా వేసుకోండి" అని, మందిచ్చి వెళ్ళిపోయాడు. నారాయణ శ్రీ బాబును మనసారా స్మరించుకొని ఫోటో వంక చూస్తూ మొదటి డోసు మందు వేసుకొని, 'ఓం బాబు, ఓం బాబు' అని జపం మొదలు పెట్టాడు.

ఆశ్చర్యం ! నొప్పి తగ్గుముఖం పట్టి గంట లోపలే రెండవ డోసుతో పనిలేకుండానే తగ్గిపోయింది! నిజమే! సద్గురువు లక్ష్యార్థంగా ప్రసాదించిన ఒక మంత్రంతో భవరోగమే నివారణ అవుతున్నపుడు ఒక డోసుతో నారాయణ కడుపునొప్పి తగ్గటంలో ఆశ్చర్యమేముంది? దీక్షితులు తన స్నేహితునికి ఫోన్ చేస్తే, అతడు ఊళ్ళోనే లేడని చెప్పారు.

మరి ఆ వచ్చిన మిత్రుడెవరు? జీవితంలో ఎవరు విడిచినా తాను విడువక వెంటనంటి ఉండి, శరీరము పతనమైన తరువాత కూడా తనతోడు విడువక గమ్యం చేర్చే ఏకైక మిత్రుడు, దైవము, బంధువు అయిన గురుపరమాత్ముడు ఒకడే నిజమైన మిత్రుడు. ( మిత్ + ర=మిత్ర) మిత్ - మృత్యువును, ర - రహితం చేసేవాడే నిజమైన స్నేహితుడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు - రమణ ప్రసాద్

# శ్రీ స్వామి వివేకానంద

తమ అభిభాషణలో "సహనాన్ని, విశ్వజనీన ఆమోదాన్ని బోధించిన సనాతన ధర్మానికి చెందిన వ్యక్తిగా నేను గర్వపడుతున్నాను. సర్వమత సహనాన్నేకాక, సకలమతాలూ సత్యాలనే మేము విశ్వసిస్తాం. Exclusion అన్న పదమే తర్జుమా చేయబడని పావన భాష అయిన సంస్కృతం ఏ మతభాషగా చలామణి అయిందో ఆ మతానికి చెందినవాడనని గర్విస్తున్నాను. సమస్త దేశాల నుంచి పీడితులూ, శరణాగతులై వచ్చిన వారికి ఆశ్రయం కల్పించిన దేశానికి చెందిన వాడనని మీకు తెలుపటంలో నేను గర్విస్తున్నాను. రోమన్‌ల నిరంకుశత్వానికి గురై దక్షిణభారత దేశానికి వచ్చి శరణు పొందిన యూదులను మా కౌగిట చేర్చుకున్నామని చెప్పటానికి గర్విస్తున్నాను. మహాజోరాష్ట్రీయ సంఘంలో శోషించిన వారికి శరణు ఒసగి నేటికీ వారినాదరిస్తున్న సనాతన ధర్మం నా మతం అని చెప్పుకోటానికి గర్విస్తున్నాను."



"సోదరులారా! ప్రతిరోజు ప్రతి హైందవ బాలుడూ, బాలికా పారాయణం చేసే ఒక స్తోత్రం నుంచి కొన్ని చరణాలను ఉదహరిస్తాను "వివిధ ప్రదేశాలలో ఉద్భవించిన నదులు సముద్రంలో సంగమం చెందినట్లే, వివిధ భావాలచే మనుష్యులు అవతరించి వివిధ ఆరాధనా మార్గాలు వక్రాలై కనబడినా, అవక్రాలై కనబడినా సర్వేశ్వరా! నిన్నే చేరుతున్నాయి.

నిరు పేదలైన నాదేశ ప్రజల నిమిత్తం సాయం కోరటానికి నేను ఇక్కడికి (అమెరికా) వచ్చాను."

"చికాగోలో నా ప్రథమ ఉపన్యాసంలో అమెరికా సోదర సోదరీమణులారా" అని సంబోధించాను. వారంతా లేచి నిలబడ్డారు. అలా

వారిని స్పందింప చేసింది ఏమిటో మీకు ఆశ్చర్యం కలిగించవచ్చు. అది నా బ్రహ్మచర్యనిష్ఠ ఆప్రతిహతమైన శక్తిగా నాలో పెంపొందింది.

పత్రికలు "క్లుప్తంగా చేసిన అనేక ప్రసంగాలు వక్తృత్వ వైవిధ్యాన్ని ప్రదర్శించినా, విశ్వమత మహాసభ స్ఫూర్తిని, దాని లోతులను ఈ హైందవ సన్యాసి వ్యక్తం చేసినంత బాగా మరెవరూ వ్యక్తం చేయలేదు" అని శ్లాఘించాయి. నేను అమెరికా వెళ్ళటం విశ్వమత మహా సభ నిమిత్తం కాదని చాలామందికి తెలుసు. నా దేశస్థుల కోసమే ఆమెరికా వెళ్ళాను."

జనవరి 1897లో స్వదేశానికి వచ్చి ఎన్నోచోట్ల శ్రీవివేకానంద ప్రసంగాలు చేశారు. ప్రజలలో మతం గురించిన అవగాహన హిందూ మతాన్ని పటిష్ఠింప చేయటంకోసం చేయవలసిన కృషి గురించి వారు ప్రసంగిచారు.

1897 మే 1న రామకృష్ణ మిషన్ స్థాపన చేశారు. 1898 లో బేలూర్ మఠం స్థాపన జరిగింది.

పాశ్చాత్యదేశాల నుంచి శ్రీ వివేకానంద స్వామి వారి ప్రసంగాలకు ప్రభావితమై వారి శిష్యులుగా చేరిన వారిలో ముఖ్యులు మార్గరెట్ నోబల్ (సిస్టర్ నివేదిత), శ్రీమతి సిలియర్, జోసఫైన్ మెక్‌లియాడ్, సారా ఓలేబుక ముఖ్యులు. నివేదిత కలకత్తాలో బాలికలకు శిక్షణ ఇచ్చింది.

జూన్ 1899 లో రెండవసారి వివేకానంద పాశ్చాత్యదేశాలకు వెళ్ళారు. ఎన్నో ప్రసంగాలు చేసి 1900 డిశంబర్ లో బేలూర్ మఠానికి వచ్చారు. భారత దేశం లోని ప్రజలను ఉత్తేజపరుస్తూ వారిని సన్మార్గంలో నడపటానికి అవిరళమైన కృషి చేశారు. అవిశ్రాంతంగా చేస్తున్న కార్యక్రమాలవల్ల ఆయన ఆరోగ్యం పూర్తిగా చెడిపోయినది.

1902 జూలై 4న శ్రీ వివేకానందులు మహాసమాధిలో ప్రవేశించారు. ఆయన ఒక పాశ్చాత్యునకు మహా సమాధికి ముందు వ్రాసిన లేఖలో –"మాసిపోయిన బట్టను పారవేసినట్లు నేను ఈ శరీరాన్ని త్యజించి బయటకు పోవటం మంచిది అయిఉండవచ్చు. కాని పని చేయడం మాత్రం విరమించను. భగవంతునితో ఐక్యాన్ని పొంది లోకం లోని యావన్మంది గుర్తించేవరకు వారికి సర్వత్రా ప్రేరణ కలిగిస్తూనే ఉంటాను."

శ్రీ స్వామి వివేకానంద జూలై 4 1902 నాడు రాత్రి గం॥9. 10నిలకు పరమపదించారు. ఆ రాత్రి శ్రీ వివేకానంద శిష్యురాలైన సిస్టర్ నివేదితకు రామకృష్ణ రెండవసారి దేహత్యాగం చేస్తున్నట్లు కల వచ్చింది. ఆ మర్నాడే స్వామి శివానంద బేలూర్ మఠ్ నుండి సిస్టర్ నివేదితకు ఒక సన్యాసి చేతికి శ్రీ వివేకానందస్వామి మరణ వార్త తెలుపుతూ ఒక ఉత్తరం వ్రాసి పంపారు. అది చదవగానే నివేదితకు కళ్ళు బైర్లు కమ్మాయి. చుట్టూ అంతా శూన్యంగా కనిపించింది. ఆ మర్నాడు ఆమె ఉదయం 7 గంటలకు బేలూర్ మఠ్ చేరుకుంది. వివేకానంద రూమ్‌లో వెళ్ళి స్వామి తల వద్ద కూర్చుని విసనకఱ్ఱతో మెల్లగా విసరసాగారు. ఆ సాయంత్రం 2గంటలకు స్వామివారి పార్థివ దేహాన్ని తీసుకు వెళ్ళేదాకా ఆ సేవ చేస్తూనే ఉన్నారు.

జూలై 5వ తేదీన స్వామి వివేకానంద వారి అంత్యక్రియలు జరిపారు. వారి దేహం కాషాయ వస్త్రంతో కప్పబడి ఉంది. నివేదిత ఒక చిన్న వస్త్రపు తునకను తీసికొని స్వామి జ్ఞాపకార్థం జోసెఫైన్ మెక్‌లియాడ్‌కు పంపాలనుకున్నారు. దానిని అర్థం చేసికొన్న స్వామి శారదానంద ఒక చిన్నముక్కని కత్తిరించి తీసుకొమ్మన్నారు. కాని ఆ సమయంలో అలా చేస్తే బాగుండదేమోనని ఆమె సంశయించారు. ఆమె స్వామి వివేనంద చితిని చూస్తూ కూర్చుని ఉన్నారు. షుమారు సాయంత్రం 6 గంటలకు చితి ఆరిపోయింది. ఉన్నట్లుండి ఎవరో ఆమె చేతిని లాగినట్లు అనిపించింది. ఆమె వెనుతిరిగి చూస్తే చితినుండి ఒక చిన్న కాషాయ వస్త్రపు ముక్క ఆమె వద్దకు వచ్చి పడింది. నివేదిత "దానిని స్వామి అంతిమ సందేశంగా భావించాన"ని తాము జోసెఫైన్ మెక్‌లియాడ్‌కు ది 14.9.1902లో వ్రాసిన ఉత్తరంలో తెలిపారు.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD